ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల ఇళ్ల వద్ద గుమిగూడిన జనం

'అనంత'లో శింగనమల సెగ

వైసిపి అసమ్మతి నేతల సమావేశం
అభ్యర్థిపై నిరసనాగ్రహం
మార్చకుంటే ఓడిస్తామంటూ ప్రకటన

అనంతపురం నగరంలో సమావేశమైన శింగనమల నియోజకవర్గ వైసిపి అసమ్మతి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల వైసిపిలో అమ్మతి సెగలు రాజుకున్నాయి. ఇప్పుడు ప్రకటించిన అభ్యర్థి వీరాంజినేయులును మార్చాలంటూ వ్యతిరేక వర్గం అనంతపురం నగరంలో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల నుంచి నాయకులు పాల్గొనడం చర్చనీయాంశమవుతోంది. ఎన్నికల నేపథ్యంలో వైసిపి కొత్త సమన్వయకర్తలను నియమిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా శింగనమల సిట్టింగు ఎమ్మెల్యేగానున్న జొన్నలగడ్డ పద్మావతిని కాదని కొత్త సమన్వయకర్తను నియమించారు. అయితే ఈ సమన్వయకర్త ఏనాడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఆయన సిట్టింగు ఎమ్మెల్యే పద్మావతికి సంబంధించిన కళాశాలలో ఒక ఉద్యోగి అని చెబుతున్నారు. సీటు మార్పు చేసే క్రమంలో కొత్త అభ్యర్థిని సూచించాలని అధిష్టానం సూచన మేరకు పద్మావతి, ఆమె భర్త ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తమ కళాశాలలో పనిచేసే ఉద్యోగిని సమన్వయకర్తగా నియమించారని ఆరోపిస్తున్నారు. ఆయనను మార్చకపోతే పార్టీకి ఓటమి తప్పదని బాహాటంగానే చెబుతున్నారు. ఈ వ్యతిరేక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యామనిబాల, ఎస్సీ సెల్ నాయకులు చామలూరు రాజగోపాల్, మిద్దె కుళ్లాయప్పలతోపాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డిపై అనేక ఆరోపణలు చేశారు. అధికారంలో ఉండగా ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ ఓటమి చెందిందని వ్యతిరేక సమావేశంలో అన్నారు. ఆయనపై వ్యతిరేకత ఉండటంతోనే అధిష్టానం సీటు మార్చాలని చూసిందన్నారు. పార్టీ కోసం అనేక ఏళ్లుగా పనిచేసిన వారిని కాదని కొత్త వారికివ్వడం సరైంది కాదని అన్నారు. తప్పకుండా మార్చాలని పట్టుబట్టారు. మార్చకపోతే పార్టీ ఓటమి తప్పదని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ విజయం సాధించే పార్టీనే రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తుందంటున్నారు. అందుకే మంచి అభ్యర్థిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి నెలకొన్న అసమ్మతి శుక్రవారం నాడు ఒక్కసారిగా బహిర్గతం కావడం ఆపార్టీలోనే కాకుండా జిల్లాలోనే చర్చనీయాంశమవుతోంది. ఇది వరకే అభ్యర్థిత్వం సరిగాలేదని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కూడా ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంలో ఒక ఎమ్మెల్యే తీసుకెళ్లినట్టు సమాచారం. ఇప్పుడు అసమ్మతి బాహాటంగా రావడంతో ఏమి జరుగుతుందోనన్న అసక్తి వైసిపిలో నెలకొంది. కొత్త సమన్వయకర్త వీరాంజినేయులు, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సలహదారు సాంబశివారెడ్డి మాత్రం ఇవేవీ పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. ఒకవైపు అసమ్మతి రాగం వినపడుతున్నా మరోవైపు వారు మాత్రం బుక్కరాయసముద్రం మండలంలో పర్యటన జరిపారు. కొత్త అభ్యర్థిని గెలిపించాలని, అందుకు నాయకులు కలసిరావాలని వారు తమ పర్యటనలో పిలుపునిచ్చారు. అసమ్మతి నేతలను బుజ్జగించే చర్యలేవి ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. అసమ్మతిని పార్టీ అధిష్టానం ఏ మేరకు చల్లారుస్తుందన్నది చూడాల్సుంది.

ఏ కష్టమొచ్చిందో..!

ఆత్మహత్య చేసుకున్న అక్కా చెల్లెళ్లు రూపా, జ్యోతి

- అక్కాచెల్లెళ్ల అనుమానాస్పద మృతి
- మృతులిద్దరూ డిగ్రీ విద్యార్థులు
- యాటకల్లులో విషాద ఘటన

వారిద్దరూ అక్కా చెల్లెళ్లు. డిగ్రీ చదువుతున్నారు. చదువులో ఎంతో తెలివగా ఉండేవారు. ఇంటి వద్ద కూడా చలాకీగా ఉండేవారు. చుట్టుపక్కల వారితో కలివిడిగా తిరుగుతుండేవారు. ఇలాంటి వారిద్దరూ ఒకే రోజు ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పరిస్థితి తెలుస్తోంది. చదువు పరంగా.. కుటుంబ పరంగా ఎలాంటి సమస్య లేకున్నా ఎందుకు వారు మరణించారన్న విషయం అంతపట్టడం లేదు. ఆ యువతులకు ఏకష్టం వచ్చి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారన్న విషాధాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం శెట్టూరు మండలం యాటకల్లు గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

చాకలి సరస్వతి, నారాయణస్వామి భార్యాభర్తలు. వీరికి కుమారుడు మనోజ్, కుమార్తెలు రూప(20.) జ్యోతి(18) ఉన్నారు. నారాయణస్వామి గతంలో బెలుగుప్ప మండలం నరసాపురం గ్రామంలో నివసించేవాడు. మొదటి భార్య 20 ఏళ్ల క్రితం మతి చెందింది. అనంతరం సరస్వతిని రెండో వివాహం చేసుకుని యాటకల్లు గ్రామంలో స్థిరపడ్డారు. కుమారుడు మనోజ్ మొదటి భార్య సంతానం కాగా, రూప, జ్యోష్ణలు రెండవ భార్య కుమార్తెలు. వీరిద్దరూ అనంతపురంలోని శ్రీసాయి ప్రయివేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. బయట హాస్టళ్లో ఉంటూ కళాశాలలో చదువుకునేవారు. 15 రోజుల క్రితం వీరి వారి స్వగ్రామంలో జరిగే పెద్దమ్మ జాతర నిమిత్తం ఇద్దరూ వెళ్లారు. పెద్దమ్మ జాతర ముగియడంతో శనివారం నాడు కళాశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కాగా గురువారం నాడు విద్యార్థినుల తండ్రి నారాయణస్వామి బంధువు మృతి చెందడంతో భార్యతో కలిసి కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లి గ్రామానికి వెళ్లారు. గురువారం రాత్రి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం స్వగ్రామం బయల్దేరారు. ఇంటికి వస్తున్న విషయాన్ని చెప్పేందుకు నారాయణస్వామి కుమార్తెలకు ఫోన్ చేశాడు. వారు ఎంత సేపటికీ ఫోన్ తీయకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి తమ కూతళ్లకు ఫోన్ ఇవ్వాలని చెప్పాడు. పక్కంటి వారు విద్యార్థినుల ఇంటి వద్దకు వెళ్లి చూడగా తలుపులు వేసి ఉండడాన్ని గమనించారు. బయట నుంచి పిలవగా ఎంతసేపటికీ తెవరకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూశారు. ఇంట్లో ఇద్దరు విద్యార్థినులు వేర్వేరు గదుల్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. ఉదయం 11 గంటల వరకు సరదాగా మాట్లాడుకుంటూ ఇంట్లోనే ఉన్న పిల్లలు ఇద్దరూ ఇలా మృతి చెందడంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సిఐ నాగరాజు, ఎస్ఐ రాంభూపాల్ రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి స్థానికులతో వివరాలు సేకరించారు. విద్యార్థినులు చదువులో చాలా తెలివిగా ఉండేవారని, ఇంటి వద్ద కూడా చలాకీగా ఉండేవారని స్థానికులు తెలియజేశారు. చాకలి నారాయణస్వామి కుటుంబానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ, ఇతర సమస్యలు లేనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో వీరిద్దరూ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు..? దీని వెనుక ఏ కారణాలు ఉన్న విషయాలు అంతుబట్టడం లేదు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కాగా మృతి చెందిన వారిలో జ్యోతికి మూర్ఛవ్యాధి ఉన్నట్లు మృతిరాలి తల్లి సరస్వతి చెబుతోంది. ఈ అనారోగ్య సమస్య వల్లనే వీరు ఆత్మహత్య చేసుకున్నారా.. లేక మరో ఇతర కారణాలు ఉన్నాయన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గురువారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన విధంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి విమర్శించారు. బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతు ఓటాన్ బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ వాస్తవాలకు దూరంగా మాట్లాడారన్నారు. ఉన్నత విద్యారంగంలో 28శాతం విద్యార్థినుల ఎన్ రోల్ మెంట్ పెరిగిందని, సైన్స్, టెక్నాలజీ ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43శాతం గా ఉందని, ప్రపంచంలోనే ఇది అత్యుత్తమమైనది అని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిజెపి అధికారం చేపట్టాక విద్యార్థినులు చదువులకు దూరమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, కేంద్రీయ పాఠశాలల్లో, నవోదయ విద్యాలయాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. స్కిల్ ఇండియా ఏర్పాటు చేసి ఒకటి పాయింట్ ఎనిమిది కోట్ల మంది యువతను స్కిల్డ్ యువతగా తీర్చిదిద్దామనని తెలిపారని, ఎన్ని లక్షల యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నూతన ఐటిఐలు, ఐఐటిలు, మెడికల్ కళాశాలలు, ఐఐఎంలు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెప్పారని, కానీ ఆయా కళాశాలలో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోందని అన్నారు. ప్రభుత్వమే 390కి పైగా ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులిచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఏకలవ్య పాఠశాలలు, సైనిక స్కూల్స్ తదితర ఏర్పాటు చేసినట్లు చెప్పిన దేశంలో నూతన విద్యాసంస్థలు ఎక్కడ ప్రారంభం కాలేదన్నారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు విద్యారంగానికి లేవని, నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తున్నారని అన్నారు. దేశంలో విద్యాప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలన్నారు.

ఎంపీ టికెట్ 'అంబికా'కు కేటాయించాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పార్లమెంట్ టిడిపి టికెట్ బోయ సామాజిక వర్గానికి చెందిన అంబికా లక్ష్మినారాయణకు కేటాయించే విధంగా అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని టిడిపి మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు ఎన్నో సంవత్సరాలుగా పార్టీలో కీలకంగా పని చేస్తున్న అంబికాకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని టిడిపి అధ్యక్షులు చంద్రబాబు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు మలగూరు మాజీ సర్పంచి రషీద్, అబుబకర్, సింగిరెడ్డిపల్లి బాబా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం వేసిన సర్పంచి భర్త

మధ్యాహ్న భోజన ఏజెన్సీ మార్పుపై ఆగ్రహం
ఇబ్బందులుపడ్డ విద్యార్థులు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని వంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ వివాదం నెలకొంది. ఈ వివాదంతో ఏకంగా సర్పంచి భర్త శుక్రవారం నాడు ఉపాధ్యాయులు, విద్యార్థులను బయటకు పంపి పాఠశాలకు తాళం వేశారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... వంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించే వారు వారికి గిట్టుబాటు కాలేదని దానిని ఇటీవల వదిలేశారు. విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదే గ్రామానికి చెందిన మరకొరికి ఏజెన్సీ బాధ్యతలను అప్పగించారు. తనకు తెలియకుండా ఏజెన్సీని ఎలా మారుస్తారంటూ ఈ విషయంపై గ్రామ సర్పంచి భర్త, వైసిపి నాయకుడు శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడారు. తనకు తెలియకుండా ఏజెన్సీని మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులను బయటకు పంపి పాఠశాలకు తాళం వేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల బయటనే మధ్యాహ్నం వరకు నిల్చున్నారు. దీనిపై గ్రామస్తులు జోక్యం చేసుకుని విషయాన్ని విద్యాశాఖ అధికారుల దష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎంఇఒ జయచంద్ర పాఠశాల వద్దకెళ్లి ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. సర్పంచికి సర్ధిచెప్పి పాఠశాలను యథావిధిగా తెరిపించారు. కాగా సర్పంచి భర్త సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించకోకుండా ఇలా పాఠశాలకు తాళం వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాల గేటుకు తాళం వేయడంతో బయట ఉన్న విద్యార్థులు

నేడు మంత్రి, రేపు బాలయ్య పర్యటనలు

ప్రజాశక్తి-హిందూపురం





ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో హిందూపురం నియోజక వర్గంలో రాజకీయ వేడితో పాటు నేతల పర్యటనలు సైతం ఎక్కువ అవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఒక్కడ ఎమ్మేల్యేగా గెలచినప్పటి నుంచి ఇప్పటి వరకు తూతూ మంత్రంగా పర్యటన చేశారు. అయితే ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో ప్రతి నెల పర్యటిస్తున్నారు. అదే విధంగా ఈ సారి జరిగే శాసన సభ ఎన్నికల్లో ఎలాగైన హిందూపురం నియోజక వర్గంలో వైసిపి జెండాను ఎగరవేయాలని గత నెల వారం రోజుల పాటు నియోజక వర్గంలోని రూరల్ మండలాల్లో మంత్రి పర్యటించారు. అదే విధంగా బాలకృష్ణ సైతం గత నెల జెవిఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం పురపాలక సంఘంలో శనివారం పర్యటించనున్నారు. పురపాలకసంఘ పరిధిలో 7 ప్రాంతాల్లో 38 వార్డులలో సమావేశాలను ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. దీనిపై ఇప్పటికే నాయకులు, కార్యకర్తలతో ఇన్‌ఛార్జితో పాటు ముఖ్య నాయకులు, మంత్రి వ్యక్తి గత సహయకులు సమావేశాలను ఏర్పాటు చేసి దిశ నిర్దేశం చేశారు. మంత్రి పర్యటనలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటుచేకుండా, సభలు విజయవంతం కావడానికి తగిన చర్యలు స్థానిక నాయకులు తీసుకున్నారు.

రేపు బాలయ్య పర్యటన : హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదివారం నుంచి రెండు రోజుల పాటు నియోజక వర్గంలో పర్యటించనున్నారు. ఆదివారం సాయంత్రం లేపాక్షిలో జరగనున్న నృత్య ప్రదర్శనకు హాజరవుతారు. 5న పట్టణంలో పలు వార్డులకు చెందిన పార్టీ నాయకులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బాలయ్య పర్యటన సందర్భంగా నృత్య ప్రదర్శనకు సంబందించి అక్కడక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నాయకులు చేతులు దులుపుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టిడిపికి కంచుకోటగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో టిడిపిలో జోష్ కనిపించక పోవడంతో సర్వత్రా చర్చజరుగుతోంది. దీంతో పాటు గురువారం నిర్వహించిన బిసి సదస్సు సైతం బిసిలు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. దీంతో ఓ బిసి నాయకుడిని సభ వేదికపై పిలక పోవడంతో నాయకుల మధ్య ఉన్నా విబేధాలు బట్టబయలు అయ్యాయి.

చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్నమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మడకశిర

ప్రజాసంక్షేమం, అభివృద్ధి చేసిన పార్టీనే ఆదరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మడకశిర నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పర్యటించారు. పర్యటనకు వచ్చిన మంత్రికి నియోజకవర్గంలోని నాయకులు, ఇతర ముఖ్యనాయకులు ఘనస్వాగతం పలికారు. మాజీ మంత్రి నరసయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, జిబి శివకుమార్, అమలాపురం సర్పంచి వాగేష్, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, జడ్పీ చైర్మన్ గిరిజమ్మ, వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ నళిని రంగయ్య గౌడ్ తదితర నాయకులు మంత్రికి పట్టణంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రొల్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైసిపి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 95శాతం అమలు చేసిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి అన్ని వర్గాల వారికి ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా ఎన్ని పార్టీలు ఒకటైనా జగన్ మోహన్ రెడ్డిని ఏమీ చేయలేరని అన్నారు. పార్టీలో విభేదాలు లేకుండా కలసికట్టుగా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఒక సాధారణ కార్యకర్తను సమన్వయకర్తగా నియమించడాన్ని బట్టి చూస్తుంటే పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని నిరూపించారన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ కన్వీనర్ శివప్రసాద్, వైసిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగళి : ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. మండలకేంద్రంలోని ఆర్కే కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన వైసిపి నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. విభేదాలు పక్కన పెట్టి పార్టీకి అతీతంగా పనిచేసి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, మాజీ కన్వీనర్ మహేంద్ర, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా నాయకులు భానుమతి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక వీరశైవ కళ్యాణమండపంలో సర్పంచి వాగేష్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు విబేధాలు వీడి కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. టిడిపి అబద్దాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో హాలుకూరు కాంతరాజు, అనంతరాజు, జెడ్పీటీసీ స్వారక్కనరసింహమూర్తి, ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రి లోక్‌నాథ్, ఎంపీటీసీ హనుమంతరాయ, వీరకేతప్ప, జయప్రకాష్, నారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గుడిబండ : 2024 ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేయడానికి కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి పెద్ది రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం గుడిబండలోనిహనుమాన్ థియేటర్ ఎదురుగా ఏర్పాటుచేసిన వైసిపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

మంత్రి పర్యటనలో కన్పించని ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర

మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో వైసిపి జిల్లా కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా మండలాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అయితే ఈ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఆయన అనుచరులు కన్పించలేదు. పార్టీలో క్రమశిక్షణ ఉందని చెప్పుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి సమావేశానికి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు గైర్హాజరు కావటం చర్చనీయాంశంగా మారింది. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిపై చర్యలు ఉంటాయని చెప్పుకుంటున్న అధిష్టానం ఎమ్మెల్యేపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆత్మీయ సమాజానికి ఎంపీపీ గైర్హాజరు

అగళి : అగళిలోని ఆర్కే కళ్యాణమండపంలో శుక్రవారం ఏర్పాటుచేసిన వైసిపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. అయితే ఈ సమావేశానికి స్థానిక ఎంపిపి రేణుక కామరాజు గైర్హాజరయ్యారు. ఆయన గైర్హాజరు మండలంలో చర్చనీయాంశంగా మారింది.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-హిందూపురం

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఇఒఆర్‌డి నటరాజ్ పలు సచివాలయాలను పరిశీలించారు. ఎక్కడ తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టాలని సూచించారు. తుమకుంట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, విఆర్ఒ శివనంద్, డిఎ శ్వేత ఆధ్వర్యంలో జగనన్న ఇళ్ల పట్టాలకు సంబందించి సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేసి లబ్దిదారులు పవిత్ర, టీ ఆదిలక్ష్మి, టీ. భారతి, నాగమణి తదితరులకు డాక్యుమెంట్లు అందజేశారు.

కమిషనర్ కిరణ్‌కుమార్‌ను కలిసిన డా. మదన్‌కుమార్

నూతన కమిషనర్‌ను కలిసిన డాక్టర్ మదన్‌కుమార్

కదిరి అర్బన్ : బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్ కిరణ్‌కుమార్‌ను శుక్రవారం ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ సివి మదన్‌కుమార్ మర్యాదగా పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన పీలేరు నుంచి ఇక్కడికి వచ్చారు. నూతన కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అందుకు కార్యాలయ సిబ్బంది, ప్రజల సహకారం చాలా అవసరం అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీనియర్ న్యాయవాది సివి కృష్ణమూర్తి, మిత్ర బృందం ఉన్నారు.

తలుపుల ఎంపిడిఒగా మహబూబ్‌ఖాన్

తలుపుల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నూతన ఎంపిడిఒగా పి.మహబూబ్ ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈయన ఆళ్లగడ్డ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

గోరంట్ల ఎంపిడిఒగా ప్రవీణ్ కుమార్

గోరంట్ల : నూతన ఎంపిడిఒగా ఎంజి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లాలోని గోనెగండ్ల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడి ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యా రు. నూతన ఎంపిడిఒను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నల్లచెరువు ఎంపిడిఒగా రాణెమ్మ

నల్లచెరువు : నూతన ఎంపిడిఒగా రాణె బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలు జిల్లాలోని ఆస్పరి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న శకుంతల బదిలీపై వెళ్లారు. నూతన ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

గుడిబండ ఎంపిడిఒగా బంగారమ్మ

గుడిబండ : నూతన ఎంపిడిఒగా బంగారమ్మ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

అగళి ఎస్ఐగా వీరేశ్

అగళి : నూతన ఎస్‌గా కె.వీరేశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ లావణ్య బదిలీపై తిరుపతి వెళ్లారు. పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తున్న కె.వీరేశ్ ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

నేడు జరగాల్సిన ఇంటర్ పరీక్ష వాయిదా

పుట్టపర్తి అర్బన్ : శనివారం జరగాల్సిన ఫస్ట్ ఇంటర్ పర్యావరణ విద్య పరీక్ష ఈ నెల 23వ తేదీకి వాయిదా పడినట్లు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ జిల్లా ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు.

10న నవోదయ ప్రవేశపరీక్ష

లేపాక్షి : స్థానిక నవోదయ స్కూల్‌లో 9వ తరగతి, ఫస్ట్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 10వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. 9వ తరగతికి నవోదయ స్కూల్‌లో, ఫస్ట్ ఇంటర్‌కు ఎంజెపిఆర్ స్కూల్ అండ్ కాలేజీలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఆ రోజు ఉదయం 11 గంటలకు పరీక్ష కేంద్రం చేరుకోవాలని తెలిపారు.

టెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు : టెక్నికల్ కోర్స్ హయర్, లోయర్ పరీక్షలు ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నట్లు. డిఇఒ మీనాక్షి, జిల్లా వృత్తి విద్య అధికారి లాజర్ ఓ ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్, డ్రాయింగ్, హ్యాండ్లూమ్, టైలరింగ్, ఎం లైటింగ్ ఆయా కోర్సుల్లో లోయర్, హయ్యర్ పరీక్షలకు ఈ నెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో గవర్నమెంట్ వెబ్ సైట్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

4న ప్రజ్ఞా వికాస్ పరీక్ష : ఎస్ఎఫ్ఐ

ధర్మవరం టౌన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా వికాస్ పరీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌డిఒ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష పోస్టర్లను విడుదల చేశారు. నాగార్జున మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 4వ తేదీ శ్రీ వాసవీ బాలికల జూనియర్ కళాశాలలో నమూనా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని పదో తరగతి విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కనుమ దామోదర్, నాయకులు మహేష్, సాయి పాల్గొన్నారు.

ఎస్సీలమనే చులకనగా చూస్తున్నారు

చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదు : వైస్ ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి అంజలిదేవి

ప్రజాశక్తి-చిలమత్తూరు

'ఎస్సీలమని చులకనగా చూస్తున్నారు.. చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదు' అని వైస్ ఎంపిపి అంజలిదేవి మండల సర్వ సభ్య సమావేశం లో ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సాధారణ సమావేశం రసాభాసగా మారింది. వైస్ ఎంపిపి మాట్లాడుతూ తాను అధికార పార్టీ ఎంపిపినే అయినా ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదని వాపోయారు. గ్రూపు రాజకీయాల్లో భాగంగా చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కుటుంబం నడవక కూలి పనులకు వెళ్తుతున్నామన్నారు. దీనిపై ఎంపిపి పురుషోత్తమరెడ్డి వివరణ ఇస్తూ పని చేసినప్పుడు తమను ఎవరూ సంప్రదించలేదని, సభలో పెట్టలేదని, సభ్యుల ఆమోదం లేదని, అలాంట ప్పుడు బిల్లులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. జడ్పీటీసి, ఎమ్మెల్సీ ఇక్బాల్ చెబితే చేశామంటు న్నారు. కానీ వాళ్లు నాకు చెప్పలేదన్నారు. చివరకు పిఆర్ ఎఇ కలుగజేసుకొని ఆ రోడ్డు బిల్లులు ఎంపిపి నిధుల్లో క్యాన్సిల్ చేశామని జడ్పీటీసి నిధుల కింద పెట్టామని ఇప్పటికే జమ అయి ఉంటాయని చెప్పడంతో సర్దుమనిగింది. పలువురు పంచాయతీల్లో తాగునీటి సమస్యను లేవనెత్తగా పరిష్కరించా లని ఎంపిపి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రంగ నాయకులు, ఇఒఆర్‌డి ఈశ్వ రయ్య, ఎంపిపి పురుషోత్తమరెడ్డి, సర్పంచి మురళి, సంధ్య, ఎంపిటిసి రాఘువేంద్రరెడ్డి, ఆదినారా యణప్ప, మంజునాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము పెంపుతో జీవన ప్రమాణాలు పెంపు : ఎమ్మెల్యే

కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఎటువంటి ఆధారం, ఆదాయం లేని నిరుపేదలకు సామాజిక భద్రత కల్పించడానికి సిఎం జగన్ పింఛన్ల సొమ్ము పెంచారని, తద్వారా పేదలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే శుక్రవారం మండలంలోని అడవి బ్రాహ్మణపల్లితండా పంచాయతీలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన అందించాలన్న లక్ష్యం తో సిఎం జగన్ గ్రామ సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. అనంతరం గ్రామ సచివాలయ పరిధిలో చేపట్టిన అభివద్ధి పథకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరుమలసేవేనాయక్, సర్పంచులు కుళ్లాయప్ప, లక్ష్మీదేవి చెంద్రాయుడు, శివారెడ్డి, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, నాయకులు ఇందుకూరు నారాయణ రెడ్డి, భాస్కర్, కోటేశ్వర్‌రెడ్డి, చంద్ర, కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డి రామిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దొరిగిల్లు ఉపసర్పంచి అంజి, కోఆప్షన్ నెంబర్ చిన్న బాలముని, శ్రీనాథ్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి టికెట్ నాదే.. గెలుపు మనదే : కందికుంట

సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

టిడిపి అధినేత చంద్రబాబుపై తనకు నమ్మకం ఉందని, టికెట్ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని.. కదిరి టిడిపి టికెట్ నాదే.. గెలుపు మనదేనని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుం ట వెంకటప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. కందికుంట శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వపక్షంలో విపక్షంలా కొందరు కావాలనే కదిరి టిడిపి టికెట్‌పై ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించేందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని వాటిని ఎవరూ నమ్మవద్దని సూచించారు. చంద్రబాబు కదిరి పర్యటనలో ప్రజల సమక్షంలో పట్టణ నడి బొడ్డున తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారని నాటి నుంచి నేటి వరకు అధిష్టానం కట్టుబడి ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మొపూరిశెట్టి చంద్రశేఖర్, కౌన్సిలర్ మహబూబ్ పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన టిటిడి అధికారి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పలు ఆలయాలను శుక్రవారం టిటిడి పర్యవేక్షణ అధికారి ఢిల్లీరెడ్డి, పురాణ పండిట్ గజ్జల వేణుగోపాల్ సందర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఆలయ నిర్మాణం, ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణ పనులను ఆలయ అధ్యక్షురాలు జయశ్రీతో కలిసి పరిశీలించారు. ఆయన ఆలయ రిజిస్ట్రేషన్, స్థలం, నిధులపై ఆరా తీశారు. అనంతరం చెన్నేకొత్తపల్లి మండలం ఆమిదాల కుంట గ్రామంలో వెలసిన సీతారాముల గుడి, భజన మందిరం నిర్మాణానికి నాగమణి దరఖాస్తు చేయగా వారు పరిశీలించి రిజిస్ట్రేషన్, స్థలం వివరాలు తెలుసుకున్నారు. ఢిల్లీరెడ్డి మాట్లాడుతూ ఈ రెండు ఆలయాలపై సమగ్ర నివేదికను తితిదేకి సమర్పిస్తామని, తద్వారా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. వారితో పాటు టిటిడి ధర్మాచార్యులు నక్కల వెంకటేశులు ఉన్నారు.

నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

నంబులపూలకుంట : స్థానిక వంకమద్ది రోడ్డు వద్ద ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిలో అధికార పార్టీకి చెందిన నాయకుడు ఎలాంటి అనుమతులు లేకుండా ఒక ఎకరా స్థలాన్ని ఆక్రమించుకొని రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై రైతు సంఘం నాయకుడు నాగిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులే అధికార పార్టీ నాయకులకు ప్రభుత్వ భూముల సమాచారం ఇస్తున్నారని, దాంతో వారు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అదే నిరుపేదలు ఇంటి పట్టాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు 3 సెంట్ల చొప్పున ఇంటి పట్టా ఇవ్వాలని లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు

వృత్తివిద్య కోర్సులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : విద్యార్థులకు వృత్తి విద్యలో నైపుణ్యంపై అవగాహన కల్పించడానికి శుక్రవారం మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఇండస్ట్రియల్ విజిట్ చేశామని ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. ఎలక్ట్రానిక్ కోర్స్ అభ్యసిస్తున్న విద్యార్థులను గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్దకు తీసుకెళ్లి తాగునీటి శుద్ధీకరణ, దాని వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం బీడుపల్లి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ కంప్యూటర్ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సంస్కృతి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ అలవెన్సులు మంజూరు

కదిరి టౌన్ : ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్ అలవెన్స్‌లు మంజూరు చేసినట్లు ఎన్ఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు నాలుగేళ్లుగా పెండింగ్ ఉన్న నైట్, డే అవుట్ భత్యం విషయంపై రాష్ట్ర అధ్యక్షుడు పివి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస రావు ఉన్నతాధికారులను ఒప్పించి ఈ నెల జీతంతో పాటు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయించార న్నారు. అలాగే వేతన సవరణ అరియర్స్, బకాయిల విడుదల, విద్యార్హతల్లో సడలింపు, ఉద్యోగోన్న తులు, ఉత్తమ వైద్యసేవలు, రిటైర్డు, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల చివరి మొత్తాల పరిష్కారం, గ్యారేజీ ఉద్యోగులకు ఇన్సెంటివ్, తదితర సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఇంత పెద్దఎత్తున ఉద్యోగులకు ప్రయోజనం కల్పించిన ఏకైన అసోషియేషన్ ఎన్ఎంయునే అన్నారు.

టిడిపితోనే బిసిల అభివృద్ధి

లేపాక్షి : లేపాక్షిలో శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రధాన కూడలిలో ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సభలో జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి పాలనలో బిసిలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎదిగారని పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు రంగయ్య తెలిపారు. జగన్ ప్రభుత్వం బిసిలపై కేసులు బనాయించి జైలుకు పంపిందని మండిపడ్డారు. కార్యక్రమంలో కన్వీనర్ జయప్ప, ఆనంద్‌కుమార్, రవి, చంద్ర, జయక్రిష్ణారెడ్డి, చంద్ర, వీరశేఖర్, క్రిష్టప్ప, జనసేన నాయకులు బాలాజీ, నటరాజ్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెనుకొండ : బంజారా గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాల పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉషశ్రీచరణ్ ఆవిష్కరించారు. గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు ఉమ్మడి అనంతపురం జిల్లా గుత్తి మండల పరిధిలోని సేవాఘడ్‌లో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బంజార గిరిజన సంఘం నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పరిశీలన

రొద్దం : రబీ 2023-24లో భాగంగా మండలంలోని ఆర్.కొట్టాల గ్రామంలో రైతులు సాగు చేసిన పప్పుశెనగ పొలాల్లో చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈ నెల 15వ తేదీ లోపు ఈ క్రాప్ బుకింగ్, ఈకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఎఇఒలు అంజాద్, హంసవేణి, విహెచ్ఎలు కవిత, గోవిందప్ప ఉన్నారు.

మహిళా సాధికారతే వైసిపి లక్ష్యం : మంత్రి

ప్రచారంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

మహిళా సాధికారతే వైసిపి లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆత్మీయ పలకరింపులో భాగంగా శుక్రవారం మంత్రి మండలంలోని నాగినేయినిచెరువు, గుడిపల్లి, చిన్నబావయ్యపల్లి, తుంగో డు, తదితర గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కావున మరోమారు వైసిపిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, కన్వీనర్ నారాయణ రెడ్డి, జడ్పిటిసి డిసి అశోక్, మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవినరసింహమూర్తి, సేవాదళ్ అధ్యక్షు లు వేణు, గుడిపల్లి కళ్యాణ్, సర్పంచులు, ఎంపిటిసి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి : ఎస్పీ

పోలీస్ ఫైరింగ్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-బుక్కపట్నం

పోలీసులు వృత్తిలో నైపుణ్యతను పెంపొందించుకొని గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. మండలంలోని చంద్రాయనపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ ఫైరింగ్ మైదా నాన్ని శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫైరింగ్ వల్ల పోలీసులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఫైరింగ్ రేంజ్ మైదానంలో అన్ని రకాల ఆయుధాలతో ఎఆర్, సివిల్ పోలీసులకు ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తామని తెలిపారు. డీఎస్పీ, సిఐ స్థాయి అధికారులకు కూడా ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చి ఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ ద్వారా వారి విధులను గుర్తుచేశామని తెలిపారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ విభాగంతో పాటు ఎఆర్ విభాగం కూడా కీలకమని తెలిపారు. జెసి అభిషేక్‌కుమార్, ఎఎస్పీ విష్ణు, ఆర్డీవో భాగ్యరేఖ, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, హుస్సేన్‌పీరా, సిఐలు రాగిరి రామ య్య, రాజా రమేష్, కొండారెడ్డి, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు నరసింహుడు, కృష్ణమూర్తి, పోలీసులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు మరింత పెంచాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : బాగా పనిచేసి పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. పట్టణంలోని పరేడ్ మైదానంలో యాన్యువల్ మొబలైజేషన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరై యాన్యువల్ మొబలైజేషన్ కవాతును వీక్షించి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తి, ఉత్సాహంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. రాబోయే ఎన్నికలు, సవాళ్లను ఎదుర్కునేలా సిద్ధంగా ఉండాలన్నారు. సాధారణ బందోబస్తు నుంచి శాంతిభద్రతల పరి రక్షణ విధుల్లో ఎఆర్ విభాగం పాత్ర కీలకమన్నారు. ఎఆర్ డిఎస్‌పి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, బ్యాండ్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఎన్.విష్ణు, ఎఆర్ డిఎస్‌పి విజయ్‌కుమార్, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు, రాజు, ప్రదీప్‌సింగ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పేర్కొన్నారు. టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, కాచర్ల కంచన్న, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, అంబటి సనత్, రాళ్లపల్లిషరీఫ్, చట్టా లక్ష్మీనారాయణ, బడిగింజల రమణ, బొట్టు కిష్ట, మారుతీస్వామి, గోసల శ్రీరాములు, మాధవరెడ్డి, కరెంటు ఆది, జిలకర శీన, ఊట్ల నరేంద్ర, అమరాకేశవనాయుడు, కేశగాళ్ల శీన, పల్లపు రవి, అడ్రా మహేశ్, పోలంకి హరి, గంగారపు రవి, సంజీవులు, సిబిఎన్ రామకృష్ణ, చెలిమి శివరాం, నాగేంద్ర, సురేశ్, ఆనంద్‌రెడ్డి, మాబు పాల్గొన్నారు.

బుక్కపట్నం : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. సామకోటి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను, టిడిపి ప్రకటించిన మినీమేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బాలు, వేణుగోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీరాములు, వెంకటరాముడు, చిన్న కృష్ణ, మోహన్, కిష్టా పాల్గొన్నారు.

చిలమత్తూరు : వైసిపి పాలనలో బిసిలకు రక్షణ కరువైందని, అభివృద్ధిపై ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి బెదిరింపులకు గురిచేయడం పరిపాటిగా మారిందని టిడిపి బిసి సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు కుంటిమిద్ది రంగయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ బిసిల అభివృద్ధి, అభ్యున్నతి కేవలం టిడిపి హయాంలోనే జరిగిందని, జరుగుతుందన్నారు. ఒక్కో కులానికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించిన జగన్ ప్రభుత్వం ఆయా కులాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. బిసిలందరూ ఏకతాటిపైకి వచ్చి టిడిపిని గెలిపించాలన్నారు.

రబీ పంటల పరిశీలన

లేపాక్షి : మండలంలోని గొంగటిపల్లి, చోళసముద్రం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, రాగి, వేరుశనగ, టమోటా పొలాలను శుక్రవారం ఏరువాక కేంద్రం పుట్టపర్తి శాస్త్రవేత్తలు, కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, రవికిషోర్, హిందూపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ పరిశీలించారు. శాస్త్రవే త్తలు రబీలో మొక్కజొన్న, వేరుశనగ పంటల్లో ఎరువుల యాజమాన్యంపై రైతులకు వివరించారు. వారి వెంట ఎఒ శ్రీలత, ఆర్‌బికె సిబ్బంది రఘు, తిరుమలేష్, సురేష్, ముత్యాలప్ప, రైతులు పాల్గొన్నారు.

స్పర్శ, కుష్టుపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సర్పంచి గంగమ్మ ఆధ్వర్యంలో పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాచువారిపల్లిలో స్పర్శ, కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య పర్యవేక్షించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి కళాధర్, సిహెచ్ఒ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఉపాధ్యాయురాలు పార్వతమ్మ, పంచాయతీ సెక్రటరీ ప్రవీణ, ఎంఎల్‌హెచ్‌పి విజయభాస్కర్, ఆరోగ్య కార్యకర్త రాధమ్మ, ఆశా కార్యకర్త సునంద పాల్గొన్నారు.

కొనసాగిన భవన నిర్మాణ కార్మికుల రిలే నిరాహార దీక్ష

ఓబుళదేవరచెరువు : ఇళ్ల పట్టాల కోసం ఓబుళదేవరచెరువులో భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాల్గవ రోజైన శుక్రవారం కొనసాగాయి. శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షులు కుల్లాయప్ప సందర్శించి సంఘీభావం తెలిపారు. వీరికి టిఎన్‌టియుసి మండల అధ్యక్షుడు చాంద్‌బాషా, నియోజకవర్గ అధ్యక్షులు నిజాం మద్దతు తెలిపి మాట్లాడారు. తాపీ మేస్త్రీలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కిష్టప్ప, కార్యదర్శి రవి, ట్రెజరర్ సూరి, శ్రీనివాసులు, మహేంద్ర, సహాయ కార్యదర్శి కేశవ, రమణప్ప, మణి, గంగాదేవి పాల్గొన్నారు.

4న బ్రెయిన్‌యోగాపై అవగాహన

గోరంట్ల : పట్టణంలో ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో ఈ నెల 4వ తేదీ ఇంటర్నేషనల్ బ్రెయిన్ యోగా ట్రైనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'బ్రెయిన్ యోగా'పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ భక్తవత్సలం తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచుకోవడం, శారీరక రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవడమే ఈ యోగా ముఖ్య ఉద్దేశం అన్నారు.

తారక్ చేయూత ట్రస్ట్ ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మారుతీనగర్ పోతుకుంట పోలీస్‌స్టేషన్ వెనుక నివాసం ఉంటున్న గడ్డం వెంకటేష్ పక్షవాతంతో బాధపడుతుండగా తారక్ చేయూత ట్రస్ట్ అధ్యక్షులు రామాంజ నేయులు శుక్రవారం 2 నెలలకు సరిపడా సరుకులు, రూ. 10వేల నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అనాథలు, పేదలను ట్రస్టు తరపున ఆదుకుంటా మని తెలిపారు.

శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు దాసరి తులశమ్మ భర్త వెంకటస్వామి సహకారంతో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్న దానం చేశారు. 340 మందికి ఆసుపత్రి వైద్యులు, స్టాఫ్ నర్సుల చేత భోజనం ప్యాకెట్లు, గర్భిణులకు స్వీట్లు పంచిపెట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ సత్యసాయి సేవా సమితి సేవలను కొనియా డారు. కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ విధానం రద్దు చేయాలి

ధర్మవరం టౌన్ : అప్రెంటిస్ విధానం రద్దు చేయాలని స్కూల్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరోత్తమరెడ్డి తెలిపారు. పట్టణంలోని కొత్తపేట పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ క్యాలెండర్లను విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నం సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మేరీ వరకుమారి, ఉపాధ్యాయులు రాజేశ్వరీదేవి, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో అందరికీ నాణ్యమైన వైద్యం

పుట్టపర్తి రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ నాణ్యమైన వైద్యం అందుతుందని జిల్లా వైద్యాధికారి ఎస్‌వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దిగవ చెరువుపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ నవదుర్గ ఆధ్వర్యంలో 362 మందికి చికిత్స చేసి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని పుట్టపర్తి, హిందూపురం, జనరల్ హాస్పిటల్‌కు సిఫారసు చేశారు. శిబిరంలో ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచి, సూపర్వైజర్ ఓంప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న కుల గణన సర్వేను ఎంపిడిఒ పరిశీలించారు. పెడపల్లి-1, 2, నిడిమామిడి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో జగనన్న లేఅవుట్ల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సిన వారు గ్రామ సచివాలయాలకు వెళ్లి ధ్రువ పత్రాలను సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నేడు అంతర్జాతీయ బృందం పర్యటన

పుట్టపర్తి అర్బన్ : ఎపి ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించడానికి అంతర్జాతీయ ప్రతినిధి బృందం శనివారం జిల్లాలో పర్యటిస్తున్నట్లు రైతు సాధికార సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. జర్మనీ ప్రతినిధి ప్రత్యేక బృందంతో పాటు అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బత్తలపల్లి మండలం రాఘవంపల్లి గ్రామంలో జీవ ఎరువుల తయారీని తెలుసుకుంటారన్నారు.

16న దేశవ్యాప్త బంద్

పెనుకొండ : డ్రైవర్లను జైలు పాలు చేసే హిట్ అండ్ రన్ చట్టాల రద్దుకై ఈ నెల 16వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. రఫీ, బాబా మాట్లాడుతూ డ్రైవర్ల విషయంలో బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాన్ని రూపొందించిందని మండిపడ్డారు. డ్రైవర్లు మెరుపు సమ్మె చేయడం వల్ల ఈ చట్టాన్ని తాత్కాలికంగా ఆపిందే కానీ రద్దు చేయలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, ఆటో యూనియన్ నాయకులు నాగప్ప, బాషా పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు

తలుపుల : మండల పరిధిలోని బత్రేపల్లి అటవీ ప్రాంతంలో కుక్కలు దుప్పిపై దాడి చేసి గాయపరిచాయి. కుక్కలు వెంబడించడంతో దుప్పి బత్రేపల్లి గ్రామ సమీపంలోకి రావడంతో గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని దుప్పికి ప్రథమ చికిత్స చేసి దుప్పిని అటవీ ప్రాంతానికి పంపించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఓబుళదేవరచెరువు : మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో గత నెల 30వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గొల్లపల్లి ప్రసాద్(35)చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అమడు గూరు మండలం మహమ్మదాబాద్ గొల్లపల్లికి చెందిన ప్రసాద్ భార్య రాధతో కలిసి ఆటోలో కదిరికి వెళ్తుండగా ట్రాక్టర్ ట్రాలీకు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ప్రసాద్ కర్నూలులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అతడికి భార్య, ఓ కుమారుడు, ఓ కుమార్తె సంతానం ఉన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కదిరి
O.S.No. 714/2021
Between:
నరికి ఓబులేశు ...వాది
V/S
ముతికే ఆంజినేయులు ...ప్రతివాది
To
ప్రతివాది: ముతికే ఆంజినేయులు S/o ముతికే వెంకటనారాయణ @ వెంకటనాయుడు, వయస్సు, 42 సంవత్సరాలు, హిందూ, డోర్.నెం:3/11, ఎస్సార్ పెట్రోల్ బంక్ ఎదురుగా, కుమ్మరవాండ్లపల్లె, కదిరి మున్సిపాలిటీ, శ్రీ సత్యసాయి జిల్లా.
ప్రతివాదికి కోర్టు నోటీసులు
పైన తెలిపిన వాది మీపై ప్రాంసరీ నోటు రుణ వసూలు కోసం దావా వేసి ఉన్నారు. ఈ దావాలో నిన్ను ప్రతివాదిగా చేర్చడమైనది. నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 05/03/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందు మూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:05/03/2024
స్థలం:కదిరి
కె.నాగేంద్ర రెడ్డి, బి.ఎ.,బి.ఎల్.,
వాదితరుపు న్యాయవాది, కదిరి.

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. No: 15/2022 in O.S. No. 68/2018
Between:
బండి నారాయణస్వామి S/o బి.నారాయణప్ప, డోర్ నెం :1/1132-36-F4, అడపాలవీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...డిక్రీహోల్డరు
V/S
కె.హుస్సేన్ బాషా మరియు 5 మంది ...జడ్జిమెంట్-డెబ్టార్స్
To
J.Dr No:6
మున్ని W/o రిజ్వాన్, డోర్.నెం:2-231-7, నల్లగుట్టవీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
J.Dr No:6 వేలము నోటీసులు
పై E.P. లోని డిక్రీ హోల్డరు తన డిక్రీ మొత్తము వసూలుకై E.P. షెడ్యూలు దాఖలా ఆస్తులు వేలము కోరినాడు. J.Dr No:6 అయిన నీ హాజరు నిమిత్తమై పై కోర్టులో 27/02/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందు మూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:27/02/2024
స్థలం:కదిరి
పిడుగు రవీంద్రబాబు, ఎమ్.ఎ.,బి.ఎల్.,
డిక్రీహోల్డరు తరుపు వకీలు, కదిరి.
సెల్:9440045105